క్లుప్తంగా

నేడు కొప్పరపాడులో వలంటీర్లకు వందనం

బల్లికురవ: మండలంలోని 20 సచివాలయాల్లో పనిచేస్తున్న 249 మంది వలంటీర్లకు 'వలంటీర్ల వందనం-2023' కార్యక్రమం సోమవారం సాయంత్రం బల్లికురవ, కొప్పరపాడులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లకు బల్లికురవలో 9 సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లకు కొప్పరపాడుల్లో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య చేతుల మీదుగా పురస్కారాలు అందిస్తామని చెప్పారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలని ఆయన కోరారు.

10245 మంది రైతులకు రైతు భరోసా

బల్లికురవ: ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సాయం కింద 10245 మంది రైతులకు రూ. 5.63 కోట్లు జమచేయనున్నట్లు వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 రెవెన్యూ గ్రామాల్లో అర్హులు దరఖాస్తు చేసుకోగా తొలివిడతగా ఒక్కో రైతుకు రూ. 5,500 చొప్పున సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 30న బటన్ నొక్కి జమచేస్తారని చెప్పారు. పీఎం కిసాన్ పొందేందుకు రైతు భరోసా కేంద్రాలు, మీసేవా కేంద్రాల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలని కుమారి వివరించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

చీరాల టౌన్: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి తమవంతుగా ఆర్థిక సహకారాలు అందిస్తుంటున్నామని పద్మభాస్కర్ ఫౌండేషన్ ఫౌండర్ ఘంటా అనీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫౌండర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహక నగదు బహుమతులు ప్రతిఏటా అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ హైస్కూళ్లల్లో పదిలో ఉత్తమ ప్రతిభచూపిన పేద విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా ఆర్థిక నగదు బహుమతులు అందిస్తున్నామన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు రేపు

బల్లికురవ: బాల్య వివాహాలు తదుపరి పరిణామాలు నిరోధక చట్టంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు సంతమాగులూరు ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో డీ.సుధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు సంతమాగులూరు ప్రాజెక్టు పరిధిలోని బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని ప్రజాప్రతినిధులు అధికారులతో నిర్వహించే సదస్సుకు రాష్ట్ర బాలల హక్కుల కమిషనర్ బత్తుల పద్మావతి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006పై జరిగే ఈ సదస్సుకు ప్రజాప్రతినిధులు అధికారులతోపాటు స్వయం సహాయక గ్రూపుల సభ్యులు కూడా హాజరై జయప్రదం చేయాలని సీడీపీవో వివరించారు.

ఆమంచి చొరవతో ఆర్టీసీ బస్సు

చినగంజాం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెదగంజాం గ్రామ ప్రజలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణ మోహన్‌కు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించుకున్నారు. ప్రజల అభ్యర్థనకు వెంటనే స్పందించిన ఇన్‌చార్జ్ ఆర్టీసీ అధికారులకు పెదగంజాం గ్రామానికి ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. దాంతో స్పందించిన చీరాల డిపో ఆర్టీసీ అధికారులు పెదగంజాంకు ఆదివారం నుంచి బస్సు సౌకర్యాన్ని కల్పించారు. దాంతో గ్రామ ప్రజలు కృష్ణమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

అద్దంకి రూరల్: నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకిలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక కాకానిపాలెం, మండపం వద్ద నున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి నందమూరి కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సింగ్ విజయరామారావు, డాక్టర్ ఫణీంద్రబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ సినీ, రాజకీయ రంగాల్లో మకుటంలేని మహారాజులా వెలుగొందారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ, ఇద్దరికి గాయాలు

మార్టూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని ద్రోణాదుల బొబ్బేపల్లి గ్రామాల మధ్య ఆదివారం రాత్రి జరిగింది. 108 సిబ్బంది అశోక్ వివరాల మేరకు.. ద్రోణాదుల నుంచి సుభాని బొబ్బేపల్లికి తన బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో రాజశేఖర్ బొబ్బేపల్లి నుంచి ద్రోణాదుల వైపునకు వస్తున్నాడు. ఈక్రమంలో బొబ్బేపల్లి గ్రామ సమీపానికి రాగానే ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో గాయపడిన ఇరువురిని 108 సిబ్బంది మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

స్వామియే శరణం అయ్యప్ప



పూజలందుకుంటున్న వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



తిరునాళ్లకు సర్వాంగ సుందరంగా అలంకరించిన దేవాలయం



46 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఏకశిలా విగ్రహం

- భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్న రెడ్డిపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రం
- నేటి నుంచి 19వ వార్షిక తిరునాళ్ల
- ప్రత్యేక ఆకర్షణగా 46 అడుగుల స్వామివారి ఏకశిలా విగ్రహం

మేదరమెట్ల: కోరినవారికి కొంగు బంగారంగా నిలుస్తున్నాడు సుబ్రహ్మణ్యేశ్వరుడు. ఆయనను నమ్మివచ్చిన వారిని తన చెంతచేర్చుకొని బాధలు తీరుస్తూ అండగా ఉంటున్నాడు. మండలంలోని పమిడిపాడు గ్రామ పంచాయతీ పరిధిలో గల కృష్ణంరాజు వారిపాలెం (రెడ్డిపాలెం)లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి క్షేత్రం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. గత 47 ఏళ్లుగా విశేషపూజలు అందుకుంటూ ప్రత్యేకంగా నిలుస్తుంది పుణ్యక్షేత్రం. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకురాలు నాగరాజస్వామి ఆలయాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ప్రతి మంగళ, ఆదివారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ఆలయ నిర్వాహకురాలు నాగరాజస్వామి సాక్షాత్తు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అంశగా పలువురు భక్తులు విశ్వసిస్తున్నారు.

నాగరాజస్వామి ఎవరంటే..

ఆలయ నిర్వాహకురాలు నాగరాజస్వామి తన బాల్యంలో పెద్ద జబ్బు చేసింది. ఎన్నో ఆసుపత్రులు తిప్పి వైద్యం చేయించినా ఆమె బతుకుతుందనే నమ్మకం తల్లిదండ్రులకు గానీ బంధువులకు గానీ లేకపోవడంతో చివరి ప్రయత్నంగా పెదకాకానిలో గల శివాలయంలోని పాము పుట్ట వద్ద ఆమెను ఉంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామే ఆమెను కాపాడాలని అలా కాపాడితే పాపను స్వామివారి సేవకే అంకితం చేస్తామని తల్లిదండ్రులు ప్రార్థించారు. కొన్ని రోజుల పాటు పుట్ట వద్దే ఉంటూ పూజలు చేయడం వలనో లేక స్వామి మహిమవలనోగాని ఆమెకు వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది. అప్పటి నుంచి తల్లిదండ్రులు ఇచ్చిన మాట ప్రకారం ఆమె (నాగరాజ స్వామి) స్వామివారి భక్తురాలుగా మారిపోయింది. అప్పటి నుంచి స్వామివారు తరచూ ఆమెను ఆవహిస్తూ ఉంటారు. ప్రతి ఆదివారం స్వామి ఆవహించడం ఆమె వద్దకు సమస్యలతో వచ్చిన పలువురికి పరిష్కారం చెప్పడంతో పాటు భవిష్యత్ కూడా చెప్పడం వలన ఈ పుణ్యక్షేత్రం దినదిన ప్రవర్ధమానంగా నిలుస్తుంది. స్వగ్రామంలోనే తన తల్లిదండ్రుల ధనంతో పాటు దాతలు, భక్తులు ఇచ్చిన సొమ్ముతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆలయంతో పాటు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అభయాంజనేయస్వామి, నాగేశ్వరస్వామి ఆలయం, రాష్ట్రంలో ఎక్కడా కనిపించని విధంగా 46 అడుగుల ఏకశిలద్వారా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

నేటి నుంచి నుంచి 19వ వార్షిక తిరునాళ్లు..

ప్రతి మంగళ, ఆదివారాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆగస్టులో నాగరాజస్వామి జన్మదిన వేడుకలు, నాగులచవితి, నాగపంచమి, సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి వంటి ప్రత్యేక సందర్భాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నేటి నుంచి 31 వరకు 19వ వార్షిక తిరునాళ్లు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు స్వామివార్లకు అభిషేకాలు ఉంటాయన్నారు. 31న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య దంపతులతో పాటు మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య దంపతులు కూడా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

పెత్తందార్లపై నిరుపేదల విజయం



రాజధాని ప్రాంతంలో చేపట్టిన దీక్షలకు మద్దతు తెలిపిన చీరాల నేతలు

- అమరావతిలో ఇళ్లపట్టాల పంపిణీ పై హర్షం
- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

చీరాల రూరల్: పెత్తందార్లపై అలుపెరగని పోరాటం చేసి నిరుపేదలకు రాజధాని ప్రాంతంలో 54 వేల మందికిపైగా ఇళ్లపట్టాలు ఇప్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తలంచిన సీఎం వైఎస్. జగన్‌కు అవాంతరాలు కలుగజేస్తూ నిరుపేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వద్దని కోరుతూ తెలుగుదేశం పార్టీ, వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు హైకోర్టులో కేసులు వేశారన్నారు. వారికి నిరుపేదలంటే ఏ మాత్రం చిత్తశుద్ధిలేదని విమర్శించారు. రాజధాని ప్రాంతంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే అవి మురికికూపాలుగా మారిపోతాయని వారు ఎంతో అవమానకరంగా మాట్లాడారన్నారు. తాళ్లాయిపాలెం జంక్షన్ వద్ద సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం ఆధ్వర్యంలో బహుజన నాయకులు కలసి ఇళ్ల స్థలాలు పొందే నిరుపేదలతో కలసి నాలుగు సంవత్సరాలుగా నిరసన దీక్షలు చేపట్టారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్ సీపీ ఒంటరిగానే పోటీచేస్తుందని మరలా సీఎం జగన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని వారు పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎస్టీసెల్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల రాజ్‌కుమార్, కాపుసంఘం పర్చూరు మండల అధ్యక్షుడు కోలా వీరయ్య, సోషల్ వర్కర్ పులి నిరంజన్, మండా గిరీష్, మాజీ సర్పంచ్ మండా సత్యం, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకుడు మువ్వ సాయి ప్రదీప్, నాగేశ్వరరావు, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

నాటిక పోటీలకు విశేష స్పందన



కమనీయం నాటికలో సన్నివేశం

పర్చూరు (చినగంజాం): జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నాటక పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో కళానికేతన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించడంతో పాటు విశేష స్పందన వ్యక్తమవుతోంది. రెండో రోజు పోటీలను తిలకించేందుకు కళాకారులు, కళాభిమానులు భారీగా తరలివస్తున్నారు. ప్రత్యేక ఆహ్వానితులచే జ్యోతి ప్రజ్వలన, నటరాజ పూజల అనంతరం నాటిక పోటీలను శనివారం రాత్రి ప్రారంభించారు. న్యూ స్టార్ మోడరన్ ఆర్ట్స్ విజయవాడ వారి కపిరాజు నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. రామలక్ష్మణుల గర్వం, అహంకారాన్ని వీడి భగవంతులయ్యారని రామాయణం, మహాభారతాలు చెబుతున్నాయి. అహంకారం మనిషిని పతనావస్థకు చేరుస్తుంది. అహంకారం గర్వం వల్ల మనిషి ఎంత నష్టపోతాడో తెలిపే కపిరాజు నాటిక వృత్తాంతం. అనంతరం సద్గురు కళానిలయం గుంటూరు వారి కమనీయం నాటిక కళా సంపదకు నిలువుటద్దం. సినీ, నాటక రంగాల్లో కాలక్రమేణా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎన్ని మార్పులు వచ్చినా నాటికలు,నాటకాలను చూసేందుకు ప్రేక్షకులు రంగస్థలం వద్దకు తప్పక రావాలన్న ఇతివృత్తంతో ఈనాటిక సాగింది. తదనంతరం ప్రదర్శించిన ఆలీతో సరదాగా, నాన్నా నేనెళ్ళొస్తా నాటికలు కూడ ప్రేక్షకులను మరింత ఆనందింపజేశాయని నిర్వాహకులు చిట్టినేని సాయిబాబు,.కోలా శ్రీనివాసరావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గోరంట్ల రాంబాబు, యార్లగడ్డ రామకృష్ణలు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకం దగ్గర కావాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

అద్దంకి: విద్యార్థులందరికీ పుస్తకం చేరువ కావాలని గ్రంథాలయ ఉద్యమ సారథి, సాహితీవేత్త మంచి కంటి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలోని గ్రంథాలయాలను మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తూ 'మరో గ్రంథాలయం నిర్మిద్దాం రండి' నినాదంతో యాత్ర చేస్తున్నారు. ఆయన యాత్ర ఆదివారం అద్దంకి చేరింది. యాత్రకు సృజనతో పాటు సాహితీ సంస్థలు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా మంచికంటి మాట్లాడుతూ సాహిత్యం ద్వారా సమాజాన్ని అర్థం చేసుకోవాలన్నారు. పుస్తకమే అన్ని నేర్పిస్తుందన్నారు. యువతకు పుస్తకాన్ని పరిచయం చేసే విధంగా పెద్దలు కృషిచేయాలన్నారు. దీనిలో భాగంగా వెంకటేశ్వరరెడ్డి మోటార్ సైకిల్ యాత్ర విజయవంతం కావాలని గ్రంథాలయం పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని కోరుతూ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, గాడేపల్లి దివాకరదత్తు, అనీల కుమారసూరి, చిన్ని మురళీకృష్ణ, షేక్ మహ్మద్ రఫీ, చెనుపాటి రామాంజనేయులు, డీవీఎం సత్యనారాయణ, లక్కరాజు చంద్రశేఖర్, మందా జోసఫ్, అద్దంకి లెవీ ప్రసాద్, చుండూరి మురళీ సుధాకర్‌రావు, పీ సీహెచ్ కోటయ్య పాల్గొన్నారు.

31 నుంచి గంగమ్మతల్లి సంబరాలు



గంగమ్మతల్లి మూలవిరాట్

వేటపాలెం: స్థానిక పాకనాటి వీధిలో వేంచేసియున్న గంగమ్మ తల్లి సంభరాలు ఈ నెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 31న పోలేరమ్మ అమ్మవారికి సద్ది, నైవేద్యాలు చెల్లింపులు, జూన్ 1న ఉదయం మహాలక్ష్మీ అమ్మవారికి వడపప్పు, పానకాలు చెల్లింపు, 2న గంగమ్మ తల్లి ఊరేగింపు, వీరదాళ్ల సేవ కార్యక్రమతో సంబరాలు ముగుస్తాయని చెప్పారు.

ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాగబైరు గాయత్రి ఆర్థిక సాయంతో పండ్లు, రొట్టెలు, మజ్జిగ ప్యాకెట్‌లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గురుమహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన మంచినీరు, పరీక్ష నిర్ధారణకు అవసరమైన పరికరాలు అందించటంతో పాటు రోగులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేస్తున్నందుకు క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు, పాటోలు వెంకన్న, పీ చంద్రం, మున్నంగి వెంకట సుబ్బయ్య, కోమటి ఆంజనేయులు,ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో విశేష పూజలు



కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

చినగంజాం: స్థానిక హనుమ సాయి కుటీరం నందు వేంచేసియున్న షిర్డి సాయిబాబా మందిరంలో ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కాకడ హారతి, ప్రాతఃకాలార్చన, అభిషేకాల అనంతరం లలిత, విష్ణు సహస్ర నామ స్తోత్రాలతో సాయినాధుడికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయి చాలీసా, హనుమాన్ చాలీసా పారాయణం, హారతి తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సోపిరాల గ్రామంలో సాయిబాబా ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి సాయిబాబా ఊంజల్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రుడిని బయటకు తీస్తున్న 108 సిబ్బంది

మార్టూరు: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం ఉదయం బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగింది. బల్లికురవ 108 సిబ్బంది సురేష్ వివరాల మేరకు.. గుంటూరు సమీపంలోని వెంగళాయపాలేనికి చెందిన చర్చి పాస్టర్ ఆర్ ప్రసాదరావు తమ సంఘ సభ్యులతో నెల్లూరులో జరుగుతున్న ప్రార్థనా కూటముల కోసం వెళ్లి శనివారం అర్ధరాత్రి గుంటూరుకు వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. బొల్లాపల్లి టోల్ ప్లాజా సమీపంలో వీరి వాహనం రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టడంతో ప్రసాదరావు తీవ్ర గాయాలతో వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. వెనుక ఉన్న మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయట పడగా టోల్ ప్లాజా సిబ్బంది అతి కష్టంతో ప్రసాదరావును వాహనం నుంచి బయటకు తీశారు. క్షతగాత్రులను చిలకలూరి పేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

అద్దంకి: విద్యార్థులంతా బాగా చదివి ఉన్నతులుగా ఎదగాలని విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం అన్నారు. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కార్యాలయంలో ఆదివారం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి రూ.1000 వంతున ఐదు మందికి రూ.5 వేలు పంపిణీ చేశారు. 581 మార్కులు సాధించిన వారందరికీ సత్కారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. అద్దంకి సంఘం చేస్తున్న సేవలను కొనియాడారు. అలాగే ప్రకాశం ప్రభుత్వ పాఠశాలలో ఈఏడాది జిల్లాలో మొదటి స్థానం సాధించిన దర్శికి చెందిన నూతలపాటి నాగసాయి సౌగంధిక ప్రకాశం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి స్థానంలో నిలిచి అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థినికి సంఘం తరుపున రూ.3 వేలు అందజేశారు. కార్యక్రమంలో పురోహితుడు సత్తెనపల్లి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నరసింహాచారి, ఉలవపాడు రవికుమార్, చింతలపూడి వీరయ్య, ముత్తులూరి హరిబాబు, మల్లవరపు నటరాజ్, దేవరకొండ నాగేశ్వరరావు, లైన్ ఇన్స్‌పెక్టర్ జీ సుబ్బారావు, బహునాథం నాగాచారి, హరికృష్ణ, కొండాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు అవగాహన అవసరం



గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అమృతపాణి

ఇంకొల్లు (చినగంజాం): కంటి వైద్యంపై గ్రామీణ వైద్యులు అవగాహన కలిగి ఉండాలని చీరాలకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వరికూటి అమృతపాణి అన్నారు. ఆదివారం గ్రామీణ వైద్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా అమ్మ కంటి వైద్యశాల నందు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంటిలో రెటీనా, గ్లుకోమా, నీటికాసులు మొదలయిన సమస్యలు ఉంటాయని, కంటి కలక విషయమై వచ్చే వారికి తగు జాగ్రత్తలు, సూచనలు తెలియజేయాలన్నారు. ప్రస్తుతం కండ్లకలక సీజన్ నడుస్తోందని, ఎక్కువ రిస్క్ తీసుకోకుండా గ్రామీణ వైద్యులు రోగిని కంటి వైద్యుని వద్దకు పంపాలని అన్నారు. వయస్సు 45 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఛత్వారం వస్తుందని తగు జాగ్రత్తలు తీసుకొని కళ్లజోడు పెట్టుకుంటే ప్రతి సంవత్సరం కంటి వైద్యుని వద్దకు వెళ్లాలని ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం గ్రామీణ వైద్యులకు సర్టిఫికేట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇంకొల్లు ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రావినూతల శ్రీనివాసరావు, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

31న అద్దంకి పురపాలక సమావేశం

అద్దంకి రూరల్: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో పురపాలక సంఘ సాధారణ సమావేశం ఈనెల 31 బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు అధికారులతో సమీక్ష సమావేశం

చీరాల టౌన్: చీరాల రూరల్ మండలం, మున్సిపాలిటీలోని అన్నీ వార్డుల వీఆర్వోలతో సోమవారం చీరాల తహసీల్దార్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. ఈసమీక్ష సమావేశానికి హాజరయ్యే రెవెన్యూ అధికారులు, సిబ్బంది విధిగా తగిన సమాచారంతో హాజరు కావాలని తహసీల్దార్ సూచించారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎస్ వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం వరకు వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు, రైతులు, విద్యార్థులు అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. మండలస్థాయిలో జరిగే కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం, ఉత్తర నక్షత్రం దశమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఘనంగా పోలేరమ్మ కొలుపులు



మొక్కులు తీర్చుకునేందుకు ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

చినగంజాం: మండలంలోని సోపిరాల గ్రామంలో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మ కొలుపులు ఘనంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు ఆది, సోమ, మంగళవారాల్లో నిర్వహించే కార్యక్రమంలో మొదటి రోజు పానకం, వడపప్పు తీసుకొని మేళతాళాలతో ఊరేగింపుగా భక్తులు పోలేరమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.